విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 5, మార్చి 2025

## ఘనంగా సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి.మహేష్ పుట్టినరోజు

**విశాలాంధ్ర, గుంతకల్ :** స్థానిక బిటి పక్కిరప్ప భవన్ నందు హమాలి యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మరియు సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పనిచేస్తున్నటువంటి బి.మహేష్ జన్మదిన వేడుకలను సిపిఐ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి పట్టణ కార్యదర్శి గోపీనాథ్ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ రూరల్ కార్యదర్శి రాము రాయల్ ఏఐటియుసి మండల అధ్యక్షుడు తలారి సురేష్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర సిపిఐ నాయకులు ఉమర్ భాష వెంకట్ నాయక్ ప్రసాద్ గద్దం భాష నరసయ్య హమాలి యూనియన్ నాయకులు,ఆర్టీసీ హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**విశాలాంధ్ర-రాప్తాడు :** గ్రామాల్లో కీటక జనిత వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని మలేరియా విభాగం జిల్లా అధికారి ఓబులు సూచించారు. రాప్తాడు పి.హెచ్. సి.లో మంగళవారం డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జ్వరము సర్వే చేసే విధానము, మలేరియా , డెంగ్యూ వ్యాధులు వచ్చినపుడు చేయవలసిన పనులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. హౌస్ ఇండెక్స్, కంటైనర్ ఇండెక్స్, బ్రూటల్ ఇండెక్స్, క్రిమి సంహారక మందులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, మలేరియా సూపర్వైజర్ శ్రీధర్ మూర్తి, సూపర్వైజర్లు నరసింహ, అరుణమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఎం.ఎల్. హెచ్.పిలు, ఎం.పి.హెచ్.ఎలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలు బాగా పని చేయాలి

**విశాలాంధ్ర, యాడికి :** రాయల్ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు పరమేష్ ,దేవరాజ్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విష జ్వరాల కట్టడికి వెక్టార్ కంట్రోల్ ఐజిన్ ప్రోగ్రామ్ నందు గ్రామంలో దిబ్బలను మురికికుంటలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రక్తపూతలను తప్పక తీసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబులకు పంపాలని తెలియజేశారు, వచ్చేది వేసవికాలం కావున ఓఆర్ఎస్ తప్పక ఉంచుకొనవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ జుబేదా పీహెచ్ ఎన్ వెంకటలక్ష్మి మేల్ సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్ ఫిమేల్ సూపర్వైజర్ సరోజమ్మ పాల్గొన్నారు.

## 25 నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్

**విశాలాంధ్ర-జేఎన్టీయూఏ:** ఇంజనీరింగ్ చేరాలని విద్యార్థుల జీవిత కలల స్వప్నాన్ని నెరవేర్చుకునేందుకు , విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు పల్లె ఉమా ట్రస్ట్ నేతృత్వంలో పి వి కె కె ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత ఎంసెట్ కోచింగ్ మార్చి 25, 2025 నుండి మే 10, వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ బాలాజీ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పల్లె రఘునాథ్ రెడ్డి, కళాశాల చైర్మన్ పల్లె కిషోర్ తెలిపారు. ఎంసెట్ పరీక్ష పై నిపుణులతోఎంట సలహాలు, సూచనలు ఇప్పిస్తామన్నారు. అవకాశం ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని విజయ శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. మరిన్ని వివరాలకు 8886630029, 8886630031 సంప్రదించాలని కోరారు.

## పీవీకేకే ఐటీలో ఇంగ్లీష్ నైపుణ్య పరీక్ష..

**విశాలాంధ్ర-జెఎన్టియుఏ:** పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో గ్లోబల్, అబ్రాడ్ ఫోకస్ సంస్థల డైరెక్టర్లు ఎన్.రాజ్‌కుమార్, అపర్ణ ఇంగ్లీష్ అసెస్‌మెంట్ టెస్ట్ ను నిర్వహించారు. ఈ పరీక్ష బీటెక్ రెండవ, మూడవ విద్యార్థుల కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అంచనా వేసే ప్రయత్నం చేశారు. పరీక్షల ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, ఏవో డాక్టర్ మనోహర్‌రెడ్డి ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఈ తరహా కార్యక్రమాలను ఇంకా ప్రోత్సహిస్తామని వారు తెలిపారు.

## గవిమఠ బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దాం

**విశాలాంధ్ర, ఉరవకొండ :** పట్టణంలో వెలసిన గవి మఠం చంద్రమౌళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖ అధికారులు సహకారంతో విజయవంతం చేద్దామని గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఉరవకొండలో తాసిల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆయన కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 9, 10 తేదీలలో జరుగు బ్రహ్మ రథోత్సవం, లంక దహనం కార్యక్రమానికి వేలాదిమందిగా భక్తులు తరలివస్తారని , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా రథోత్సవం జరిగేందుకు భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో గవి మఠం దేవస్థానం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రాణి, తాసిల్దార్ మహబూబ్ బాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, ఎస్సై జనార్ధన్ నాయుడు పాల్గొన్నారు.

## రక్తదానం శిబిరం ఏర్పాటు

**విశాలాంధ్ర-నార్పల :** రక్త దానం ప్రాణ దానము ని, ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరు రక్తం దానం చేసి ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని టీడీపీ జిల్లా నాయకులు అలం వెంకట నారసా నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని అలం కాంప్లెక్స్‌లోని టీడీపీ పార్టీ ఆవరణలో వెంకట్ వకుళ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వెంకట్ వకుళ ఫౌండేషన్ పిలుపు మేరకు 417 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు ఎన్టీఆర్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. అలం వెంకట నారసా నాయుడు మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని, రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు, ప్రసంసాపత్రాలు అలం వెంకట నారసా నాయుడు అందజేశారు.

## గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటి స్థలమివ్వాలి

▸ సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్

**విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం :** ఇల్లు లేని నిరుపేదలకు గ్రామీణ మూడు సెంట్లు, పట్టణాలలో ప్రాంతంలో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి డిమాండ్ చేశారు.అనంతపురం నగరం మొదటి రోజున టిటిడి కళ్యాణ మండపం, అర్బన్‌లో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నగర సహాయ కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన నిరుపేద లబ్ధిదారుల అర్జీ సేకరణ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. పేదల ఇండ్ల స్థలాల కోసం సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఈనెల 6న లబ్ధిదారులతో పెద్ద ఎత్తున ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపుగా 7 నెలలు కావస్తున్న, సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని ఒక పింఛన్ మాత్రమే ఇచ్చి ప్రచార ఆర్భాటాలు తప్ప మిగతా హామీలు అమలు చేయక పోవడం, నిత్యావసర వస్తువులు ధరలు అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇళ్లస్థలాలు గురించి మాట్లాడటం లేదన్నారు. ఇప్పటికి గ్రామాల్లో, పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలు లక్షలాది మంది వున్నారన్నారు వెంటనే అర్హత కలిగిన పేదలకు స్థలాలతో పాటు ఇళ్ల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ పారుదల తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి దరఖాస్తు ఆన్లైన్లో ఎక్కించే బాధ్యత తీసుకుంటామన్నారు. నివాసయోగ స్థలాలు ఇవ్వాలని లేకుంటే ప్రజల నుంచి తీవ్ర తిరుగుబాటు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేశవరెడ్డి, సీపీఐ నగర సహాయ కార్యదర్శి అల్లి పీరా, జి.సంతోష్, చిత్రాచేడు రామాంజినేయులు, ఎలుట్ల నారాయణస్వామి, చాందుబాష, ఈడిగ ప్రసాద్, సుందర్ రాజ్, ఖాజా, నాగప్ప, ఆనంద్,శ్రీరాములు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి చెంప పెట్టులాంటివి

- ఎన్నికల ఫలితాలపై వైసీపీ అసత్య ప్రచారం చేస్తోంది
- ఎమ్మెల్యే దగ్గుపాటి

**విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ :** 9నెలల కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై అన్ని వర్గాలు సంతృప్తిగా ఉన్నారని.. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యావంతులు సానుకూలంగా ఉన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో కూటమి మద్దతిచ్చిన అభ్యర్థులు ఐదు చోట్ల గెలవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో దేశంలోనే రికార్డు స్థాయి మెజారిటీలతో ఘనవిజయం సాధించడాన్ని బట్టి తెలుగుదేశం ప్రభుత్వంపై మేధావి వర్గం ఎంత సంతృప్తిగా ఉందనేది అర్థమవుతోందన్నారు. గత కొన్ని రోజులుగా వైసీపీ నాయకులు ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని ప్రచారం చేస్తున్నారని.. అయితే తాజాగా వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వారికి చెంప పెట్టులాంటివన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పోటీలో లేకపోయినా, పీడీఎఫ్ అభ్యర్థుల కోసం పనిచేయాలని ఆ పార్టీ అధిష్టానం ఆదేశించింది. తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు కృష్ణా, గుంటూరులో వైసీపీ శ్రేణులు పీడీఎఫ్ అభ్యర్థుల కోసం పనిచేశారని.. కానీ వైసీపీ ప్రచారం చేయడం వలన వారికి మరింత నష్టం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పనితీరుపై పట్టభద్రులు సంతృప్తితో ఉండటంతోనే తొలి ప్రాధాన్యత ఓటుతోనే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల స్థానంలో ఆలపాటి రాజా గెలుపొందినట్లు చెప్పారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానంలోనూ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ ఆధిక్యాన్ని సాధించారన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తన చేతుల్లోకి తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గాడిలో పెట్టడానికి 9నెలలుగా శ్రమిస్తున్నారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం ముందువరుసలో ఉందన్నారు. కానీ వైసీపీ మాత్రం ప్రభుత్వంపై అసంతృప్తి అంటూ వాస్తవ దూరమైన ప్రచారం చేసిందన్నారు. ఇప్పుడు పట్టభద్రులు కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఈ ప్రభుత్వానికి మద్దతు తెలిపారన్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఉత్తరాంధ్ర నియోజకవర్గం ఎన్నికల బరిలో టీడీపీ లేదని.. రఘువర్మ, గాదె శ్రీనివాసులు నాయుడు ఇద్దరికీ మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లు వేయాలని వేలాదిమంది టీడీపీ కేడర్‌కు టెలికాన్ఫరెన్స్ ద్వారా మా అధినేత చంద్రబాబు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఎవరు గెలిచినా మనం మద్దతు ఇచ్చిన వారే అని స్పష్టం చేశారన్నారు. ఈ ఫలితాలతో వైసిపి వెన్నులో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

## మధ్యాహ్నానికే మూతబడిన ధోనిముక్కల సచివాలయం

**విశాలాంధ్ర గుంతకల్:** స్థానిక మండల అధికారి కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ధోనిముక్కల సచివాలయం మధ్యాహ్న సమయానికే మూతపడడం పట్ల సిపిఐ పార్టీ తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం సందర్శించి వివిధ పనుల కోసం వచ్చిన రైతులు ప్రజలు సచివాలయం మెట్ల పైన కూర్చొని అధికారుల కోసం ఎప్పుడు వస్తారని ఎదురుచూస్తున్నట్లు గమనించారు. అక్కడే ఉన్న కొంతమంది ప్రజలు ఈ విషయాన్ని సీపీఐ నాయకుల దృష్టికి తెపేగా వెంటనే రాము రాయల్ వెళ్లి అక్కడకు పరిశీలించగా కార్యాలయానికి తాళాలు వేసి ఉన్నాయి. అయితే ఒక అధికారి కార్యాలయానికి తాళాలు ఎప్పుడు తెరుస్తారని వేచి ఉండడం గమనార్హం. మండల అధికారులు స్పందించి మండల వ్యాప్తంగా ఇలాంటి సచివాలయాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.. లేకపోతే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## హంద్రీనీవా ద్వారా 33 చెరువులకు నీరందించండి

- కాలువను దాటేలా వంతెనలు నిర్మించాలి
- యూపీఏ కాలువ భూసేకరణ పెండింగ్ నిధులివ్వాలి
- సీఎంను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**విశాలాంధ్ర-రాప్తాడు :** హంద్రీనీవా ద్వారా రాప్తాడులోని 38చెరువులకు నీరందించాలని నీటి సమస్యలపై సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు.అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. హంద్రీనీవా 2వదశలో కాల్వకు లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలున్నాయని, లైనింగ్ పనులు చేస్తే రాప్తాడు నియోజకవర్గంలో 38 చెరువులకు నీరందకుండా భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలన్నారు. కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలను నిర్మించాలన్నారు. అదేవిధంగా రాప్తాడులో 70వేల ఎకరాలకు పైగా హంద్రీనీవా పరిధిలో ఆయకట్టు ఉందని, నేటికీ డిస్ట్రిబ్యూటరి సిస్టమ్ లేనందున తాత్కాలికంగా హంద్రీ నీవా నీటిని కాలువ ద్వారా చెరువులకు సరఫరా చేస్తున్నారన్నారు. ఆయకట్టును స్థిరీకరించి పంట కాలవల అభివృద్ధి చేస్తే భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయన్నారు. దీని వలన పరోక్షంగా మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం 2018లో భూములిచ్చిన చాలా మంది రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు. ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ నిధులను విడుదల చేసి పనులను పునః ప్రారంభించాలని కోరారు. ఎమ్మెల్యే సునీత చెప్పిన అన్ని అంశాలను విన్న చంద్రబాబు రాప్తాడు నియోజకవర్గ రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని చెరువులకు నీరందించే విషయంలో రాజీ ఉండదని సీఎం భరోసా ఇచ్చారన్నారు.

## సమానత్వ సాధనకు పోరాటం వేగవంతం...

– మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని పిలుపు

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం :** మహిళలు గౌరవప్రదంగా జీవించే హక్కు దాతృతం కాదని... ఇది మన హక్కు అని, ఈ హక్కును పూర్తిగా సాధించుకొనే వరకు కలిసికట్టుగా పోరాడాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం ప్రెస్ క్లబ్‌లో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి అధ్యక్షతన ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి దుర్గాభవాని మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను పూర్తిగా సాధించుకునేందుకు, మహిళా సాధికారిత దిశగా సమానత్వం కోసం చేసే పోరాటాలను వేగవంతం చేయాలని కోరారు. ప్రిన్సిపల్ ప్రశాంతి, న్యాయవాది పద్మజ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఉద్యమాలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుపుకోవాలన్నారు. దేశంలో సమానత్వం సాధించడానికి 2158 వరకు పట్టవచ్చని నిపుణుల అంచనా వేస్తున్నారని, మహిళలకు భద్రత, రక్షణ కల్పించేందుకు, మహిళా సాధికారిత కోసం పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే వ్యవస్థ మొత్తం పక్షవాతంతో బాధపడుతున్న రోగిలా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతి ప్రసాద్, నగర అధ్యక్షురాలు జానకి, కమ్మక్క, లక్ష్మిదేవి, మాబున్ని, మమత, సునీత, సారంబి, రాధిక, ప్రియామాధురి పాల్గొన్నారు.

## జీఓ 21, 31లను రద్దు చేయాలి..

ప్రతి ఆటో కార్మికునికి వాహనమిత్ర రూ. 15 వేలు ఇవ్వాలి : ఏఐటీయూసీ

**విశాలాంధ్ర, అనంతపురం:** ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల్లో ఉన్న ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో కార్మికునికి రూ. 15 వేలు వాహన మిత్ర వెంటనే ఇవ్వాలన్నారు,కార్మికులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న జిఓ నెం. 21,31లను వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏమి చెప్పినా తానా అంటే తందానా అంటూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోం దన్నారు. విపరీతంగా చలానాలు పెంచి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు.కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 849 గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న చలానాలను కూడా రద్దు చేయకుంటే ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజు,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, నాయకులు రమనా నాయక్, రఘు, నరసింహ, భాషా, షర్మాన్, హస్మత్ బీ,గోవింద్ నాయక్, ఓబులేసు, ఆది, బాబు,శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులపై పైశాచికం..

- ఆందోళన చేసిన తల్లిదండ్రులు

**విశాలాంధ్ర, కనేకల్ :** కనేకల్‌లోని ప్రైవేట్ పాఠశాల లిటిల్ ఏంజెల్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసులు ఇంటి ముందుర విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. 8 తరగతి చదువుతున్న వినయ్ కుమార్‌ను కరస్పాండెంట్ భారతి చితకబాదారని, అలాగే మరొక విద్యార్థి మధ్యాహ్న భోజనం అనుమతితో తిరిగి వచ్చిన సాహిల్ క్లాస్ టీచర్ బాబు సార్‌ను అడిగి మధ్యాహ్నం నమాజ్ కోసం పర్మిషన్ తీసుకొని వెళ్లి ఇన్ టైంలో వచ్చాడు, అయినప్పటికీ కరస్పాండెంట్ భారతి మేడం బాలుడి మీద దుర్భాషలాడారని, అలాగే పిల్లల మధ్య నమాజ్ చేయమని కుల దూషణల పర్వం చేశారు. దీనిపై ముస్లిం పెద్దలు కరస్పాండెంట్ భారతి మేడంపై మండిపడ్డారు, ముస్లిం పెద్దలు అందరూ కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఎమ్మార్వో ఆఫీస్ వద్దకు వెళ్లి హెడ్ మాస్టర్ శ్రీనివాస్ కరస్పాండెంట్ భారతి మీద కంప్లైంట్ ఇచ్చారు, మరొక్కసారి ఈ విధంగా కుల దోషణ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా కామ్రేడ్ పోతన్న 5వ వర్ధంతి

**విశాలాంధ్ర, శింగనమల :** మండల పరిధిలోనిచిన్న జలాలపురం గ్రామంలో పోతన్న స్తూపం ధగ్గర శింగనమల సిపిఐ పార్టీ, ఆధ్వర్యంలో దివంగత పోతన్న కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ, పోతన్న మరణించిఐదు సంవత్సరాలై నా ఆయన జ్ఞాపకాలు మరువలేనివన్నారు. పోతన్న పేద,బడుగు బలహీన వర్గాలకోసం పనిచేశాడని, అటువంటి వ్యక్తి మరణించడం పార్టీకితీరని లోటని, అయన అశయాలను అనుగుణంగా పేధల అంధాల్సిన నివేశన స్థలాలు, పక్కాగృహాలు, సరైన వైద్య సదుపాయాలు, భూమిలేని నిరుపేదల కోసం భూమి, అనే నినాదంతో ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, నాగమునెమ్మ, చంద్రశేఖర్, రాము, కళా, ఏపి రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధు యాదవ్, చేనేత మండల కార్యదర్శి, మధు, సిపిఐ సీనియర్ నాయకులు నారప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కంది పంట కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**విశాలాంధ్ర-తాడిపత్రి:** ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కంది పంట మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం జూటూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రబీ సీజన్‌కి సంబంధించి ఈ పంట నమోదు, ఈకేవైసీ 7వ తేదీ లోపు పూర్తిచేయాలని చెప్పారు. ఏపీఎఫ్ఆర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి తెలియజేస్తూ, భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పనిముట్లు 50 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నామని, రిజిస్ట్రేషన్ కొరకు ఈ పంట నమోదు తప్పనిసరి అని అన్నారు. కంది పంటను ప్రభుత్వం మద్దతు ధరతో క్వింటా రూ.7,550లతో ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో కాయలకు కవర్లు ఉద్యాన శాఖ ద్వారా అందిస్తారని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు

## పైపు లైన్ పనులను పరిశీలించిన కమిషనర్

**విశాలాంధ్ర, గుత్తి :** మున్సిపాలిటీ పరిధిలో స్పెషల్ ట్యాక్స్ కలెక్షన్ డ్రైవ్, స్పెషల్ వాటర్ సప్లై డ్రైవ్ ను మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా పలు వార్డులో పర్యటించి పరిశీలించారు. అనంతపురం రోడ్డు వద్ద గల పైపు లైను పనులను తనిఖీ చేశారు. సదరు ప్రాంతంలో పైపు లీకేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని సిబ్బంది సూచించారు. ట్యాక్స్ కలెక్షన్ 2024-25 సంవత్సరం కు సంబంధించిన బకాయిలను 100 శాతం వసూలు చేయించాలని నోడల్ ఆఫీసర్లు కు, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ హేమచంద్ర , ఆర్.ఓ కమలాకర్ సతీష్, ఆర్.ఐ షేక్షావలి, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో వైభవంగా ఊరిదేవర..

**విశాలాంధ్ర,బొమ్మనహాళ్ :** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొల్లపురమ్మ దేవి ఊరి దేవర మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. రెండురోజులు పాటు జరిగిన దేవర కార్యక్రమం ముగిసింది. గ్రామదేవతలైన. కొల్లపురమ్మ, సుంకలమ్మ ఆలయంలో సోమవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ ఆలయానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం నుండి కుంబల మహోత్సవాలు నిర్వహించి. అర్ధరాత్రి దున్నపోతును బలి ఇచ్చారు. మంగళవారం ఉదయం ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాల్వ భరత్, మాజీ సర్పంచ్ కే.సప్ప, కేపీ వన్నూరు స్వామి, ఆనంద్, ముక్కన్న ఈ వేడుకకు హాజరయ్యారు. ఊరిదేవర వేడుకకు బంధువుల, స్నేహితులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొత్తపల్లి గ్రామంకిక్కిరిసింది. ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొంది. ఒక్కో కుటుంబం నాలుగైదు పొట్టేళ్లను బలి ఇచ్చి బంధువులు, స్నేహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

## దేశ అభివృద్ధిలో ఇంజనీరింగ్ పాత్ర కీలకం

**విశాలాంధ్ర-జెఎన్టియుఏ:** దేశ అభివృద్ధిలో ఇంజనీరింగ్ పాత్ర కీలకమైనదని ఏపీ ట్రాన్స్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హెచ్. సుధీంద్ర బాబు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుస్థిర అభివృద్ధిలో లక్ష్యాలు ఎలా అధిగమించాలని.. స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ ఎలా ముందుకు వెళుతుందో అనే అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సి. జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఉత్పదక, సాంకేతికత, పారిశ్రామిక రంగాలలో సరికొత్త ఆవిష్కరణలతో విశ్వప్రగతిలో భారత్ తనదైన ముద్ర చాటుకుం దన్నారు. కార్యక్రమంలో జి.సురేష్ బాబు, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

### కలెక్టర్ టీఎస్ చేతన్

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలిజిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం సాయిరాం ఫంక్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం పై వ్యవసాయ శాఖ, ఉద్యానవనశాఖ, సెరీ కల్చర్, వెలుగు శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డిఆర్డిఏ పిడి నరసయ్య, ఉమ్మడి జిల్లా డిపిఎం లక్ష్మా నాయక్ హాజరయ్యారు. ముఖ్యఅతిథి కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా మహిళా సంఘాల ద్వారా ముందుకు తీసుకువెళ్లాలన్నారు .రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం చేకూరే విధంగా సహకారాన్ని అందించా లన్నారు. మన జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉంటుందని, దాని వలన పంటలు వేయకుండా బీడు భూములు అధికంగా ఉంటున్నాయి అలా కాకుండా ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ మహాగని, మునగ, సిల్వర్ ఓక్ చెట్లను పెట్టడం వలన నేలను సూర్య రశ్మి పడకుండా ఆర్గానిక్ కార్బన్ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చున్నారు .ప్రధాన పంటలు వేరుసెనగ కంది చిరుధాన్యాలు ప్రకృతి వ్యవసాయ విధానాలను అమలు చేస్తూ పండించడం వలన ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయడమే కాకుండా మంచి ధర ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. డీపీఎం లక్ష్మా నాయక్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, మోడల్స్, కేపిస్ మొదలైన అంశాలను క్లుప్తంగా వివరించారు. డీఏవో శ్రీ సుబ్బారావు ప్రకృతి వ్యవసాయం గురించి,కేపీసీ సమన్వయ సమావేశాలు జిల్లా,మండల, గ్రామ స్థాయిలో జరిగే విధానాన్ని క్లుప్తంగా వివరించటం జరిగింది.పిడి డిఆర్డిఏ నర్సయ్య ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినటం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిపారు. పుట్టపర్తి గులను పెంచడంలో మంచి ఫలితాలను ఇస్తుందని రైతులు రజిని, రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అను బంధ రంగాల అధికారులు, మండల మహిళ సమైక్య సభ్యు రాలు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సత్యసాయి జయంతి వేడుకలకు కెనెడా మాజీ మంత్రి లీల సాహిర్ అహమదికి ఆహ్వానం

### – ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : శ్రీ సత్య సాయి 100వ జయంతి వేడుకలకు కెనడా సాంస్కృతిక భౌగోళిక మహిళా సాధికారత మాజీ మంత్రి లీల సాహిర్ అహమదీను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మంగళవారం విజయవాడలో అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ హాల్ కు విచ్చేసిన కెనడా సాంస్కృతిక మహిళా సాధికారత మాజీ మంత్రి లీల సాహిర్ అహమద్ ను ప్రత్యేకంగా కలిశారు. భారతీయుల గొప్ప తనాన్ని, భారతీ యుల సాంస్కృతిక సంప్రదాయాలు ఎంతో బాగుంటాయని ఈ సందర్భంగా కెనడా మాజీ మంత్రి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో తన భావాలు పంచుకున్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దర్శనార్థం నా నియోజకవర్గానికి రావాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రపంచవ్యాప్తంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మానవాళికి అందిస్తున్న వైద్యం ,విద్య ,త్రాగునీటి వంటి సేవలను ఎమ్మెల్యే కెనడా మాజీ మంత్రికి వెల్లడించారు. పుట్టపర్తి ప్రాంతానికి తప్పకుండా విచ్చేస్తానని సత్యసాయిబాబా గారు అంటే తనకు ఎంతో ఇష్టమని కెనడా మాజీమంత్రి ఎమ్మెల్యేతో తెలిపారు.

## తాగునీటి కోసం రోడ్డెక్కిన జంబలబండ ప్రజలు

### విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ

విశాలాంధ్ర-గుడిబండ : మండల పరిధిలోని జంబల బండ గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోయారు. ఈ క్రమంలో అమరాపురం మడకశిర ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని.. లేనిపక్షంలో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఖాళీ బిందెలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో మండల అభివృద్ధి అధికారి గంగాధర్‌ను వివరణ కోరగా గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరుబావిలో పుష్కలంగా నీరు ఉన్నాయని.. దానికి సంబంధించిన పైప్ లైన్ కూడా పూర్తయిందని.. కేవలం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడం వల్ల సమస్య తలెత్తిందని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు.

## బత్తలపల్లిలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-బత్తలపల్లి : మండల కేంద్రంలో నివాసముంటున్న షేక్ మహబూబ్ బాషా అనే వ్యక్తి సోమవారం రాత్రి 10.30 సమయంలో ఇంటి లోపల ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన బత్తలపల్లి లో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు షేక్ మహబూబ్ బాషా పాన్ షాప్ పెట్టుకుని జీవనం సాగించేవాడు, గత రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ విషయంలో భార్య, అతడి తల్లిదండ్రులు రోజు మందలిస్తుండటంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. స్థానికులు స్థానిక ఆర్డిటి ఆసుపత్రికి తరలించగా ,ఆర్డిటి వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మహబూబ్ బాషా భార్య షేక్ భాను బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆగ్రోఫాం అక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి ఉంచాం...

- ఆగ్రోఫాం రియల్ ఎస్టేటర్లకు నోటీసు
- తహసీల్దార్ సౌజన్యలక్ష్మి వెల్లడి

విశాలాంధ్ర-లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం గ్రామ పొలాల్లో నిర్మించిన నిబంధ ఆగ్రో ఫాం నిర్మించిన రియల్ ఎస్టేట్‌లకు నోటీసు జారీ చేసినట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. చోళసముద్రం పొలం సర్వేనెంబర్ 333-9 గల వ్యవసాయ భూమిని ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నారని.. నిబంధనలకు విరుద్ధంగా క్రయవిక్రయాలు చేసారని, వ్యవసాయేతర చట్టం కింద నోటీసులు జారీ చేసామని పేర్కొన్నారు. అయితే కనీసం పంచాయతీ అనుమతి లేకపైనా ఉన్నాయా అని ప్రశ్నించిన తాసిల్దార్‌కు ఆగ్రో ఫామ్ యాజమాన్యాలు ఏ సమాధానం ఇవ్వలేదు. సర్వేనెంబర్ 333-9లో మొత్తం 14 ఎకరాల భూమిని కొనుగోలు చేసారని, అయితే ఇందులో 51 సెంట్లలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా. కన్వర్షన్ కూడా లేకుండా ఫామ్ హౌస్, స్విమ్మింగ్ ఫూల్, పార్టీ హాల్, పార్కింగ్ ప్లేస్, బెడ్ రూమ్సులను నిర్మించుకున్నారని నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా మిగిలిన భూమిలో కూడా ఎటువంటి కన్వర్షన్ లేకుండా రోడ్డు, ప్రహరి గోడలు, లైటింగ్ ఏర్పాటు చేసుకున్నారని తహసీల్దార్ పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా ఆగ్రో ప్లాట్లు అమ్మకాలు.....ఇది ఇలా వుండగా వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన రియల్ ఎస్టేటర్లు ఇష్టారాజ్యంగా 25 నుంచి 50 సెంట్లు వరకు ప్లాట్ల రూపంలో క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆగ్రో ఫాంలో ప్రభుత్వం ద్వారా అందే పథకాలకు కూడా వీరు అర్హత పొందుతున్నారు. సెంట్లు రూపంలో ప్లాట్లు అమ్మకాలు చేసి సబ్ రిజిస్టర్ కార్యాలయా నికి కూడా ఎగనామం పెడుతున్నట్లు జరుగుతోంది. అయితే వ్యవసాయాన్ని అడ్డం పెట్టుకుని రైతు సేద్యం కింద ప్రభుత్వం అందజేసే విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేసుకుని ఆగ్రోఫాం కింద విద్యుత్ వాడుతున్నట్లు తెలుస్తోంది.. ఒకవైపు పంచాయితీ, సబ్ రిజిస్టార్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ శాఖల నిబంధనలకు విరుద్ధంగా ఆగ్రోఫాం మాఫియా పెద్ద ఎత్తున దందాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.. ఆగ్రో ఫామ్ పేరుతో విలాసవంతమైన భవనాలు అత్యాధునికమైన బెడ్‌రూమ్‌లు స్విమ్మింగ్ ఫూల్ పార్టీ హాల్ తదితర వసతులను ఏర్పాటు చేసి వీటిని ఆన్‌లైన్ బుకింగ్ నిర్వహణ చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్యం లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటే ప్రభుత్వానికి ఆదాయానికి మాత్రం గండి పడుతున్నది. సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేకంగా ఉంచి చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

## అక్రమంగా చెట్టు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి

### ప్రముఖ పర్యావరణ వేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు.

విశాలాంధ్ర-ధర్మవరం: అక్రమంగా చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతులు లేకుండా సా మిల్లులలో నిలువ ఉంచితే సామిల్లులపై చర్యలకు ఆదేశించాలని, లక్షల విలువ చేసే చెట్లను ఇటుక బట్టీలలో కాలిస్తే అధిక మొత్తంలో జరిమానాలను విధించాలని కోరుతూ ప్రముఖ పర్యావరణ వేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు ఆర్డీవో మహేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ వ్యాప్తంగా వాల్టా చట్టాన్ని ధిక్కరించి ప్రతిరోజు కొన్ని వేల చెట్లను ఇష్టాను సారం నరికేస్తున్నారని తెలిపారు. దేశంలోనే రెండవ కరువుజిల్లా ఈ జిల్లా కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు నివారణ చర్యలకోసం ఎంతో ప్రజాధనాన్ని వినియోగిస్తూ ఉన్నారని, అలాంటిది వాల్టా చట్టాన్ని ధిక్కరించి, ప్రతిరోజు వేలచెట్లనునరికి కళ్ళ ఎదుటే దారుణం జరుగుతున్నా ఇంతవరకు చర్యలు చేపట్టకపోవడం దారుణం అని తెలిపారు కొందరు స్వార్థపరులైన వ్యాపారులు సంబంధిత అటవీ అధికారుల వల్ల కరువుజిల్లాలో కోట్ల జీవరాసులకు తీరని నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా సామిల్లులనుండి ఇటుక బట్టీలనుండి పక్క రాష్ట్రాలకు కలప తరలించే వారినుండి అధికమొత్తంలో మామూళ్లకు అలవాటు పడి అధికారులు కరువు జిల్లాలో ప్రకృతితో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. రక్షిస్తాని ప్రమాణం చేసి భక్షిస్తున్నారు అని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ప్రకృతిని కాపాడాలని కోరారు. ఆర్డీఓ తక్షణం స్పందించి స్పెషల్ టీంకై ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

## అనారోగ్యంతో రైలు కింద పడి మునిసిపల్ వర్కర్ మృతి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎల్‌సి కేతిరెడ్డి కాలనీలో నివాసము ఉండు మున్సిపల్ వర్కర్ ఆశాది లక్ష్మీదేవి (34) అనారోగ్యంతో మృతి చెందినట్లు హిందూపురం జీఆర్పీ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జీఆర్పీ కానిస్టేబుల్ ఎర్రి స్వామి, లక్ష్మీనారాయణ, భాస్కర్ మాట్లాడుతూ మృతి చెందిన మహిళకు పలు రకాలుగా అనారోగ్యాలకు గురి కావడం జరిగిందని, అప్పుడప్పుడు కుటుంబ కలహాలు కూడా జరిగేటివి అని వారు తెలిపారు. ఈనెల మూడవ తేదీ రాత్రి తన ఇంటి వద్ద నుండి బయటికి వెళ్లిపోయిందని, అనంతరం మంగళవారం ఉదయం ఎల్ శ్రీ కేతిరెడ్డి కాలనీ రైలు పట్టాల వద్ద శవమై పడి ఉన్న దృశ్యాన్ని చూసి స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తదుపరి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించడం జరిగిందని, అనంతరం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, సవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించడం జరిగిందని తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. మృతురాలుకు భర్త కుల్లయప్ప ,కూతురు మీనాక్షి, కుమారుడు పురుషోత్తం ఉన్నారు.

## ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

### న్యూరాలజీ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: ఆరోగ్యం పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని పదిలంగా చూసుకోవాలని న్యూరాలజీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని సాయి నగర్, సాయిబాబా గుడి దగ్గర గల స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరం హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత శిబిరంలో మెదడు, వెన్నుపాము, నరముల వైద్య చికిత్సలను అందిస్తూ, వాటికి తగ్గ మందులు, సలహాలను ఇవ్వామన్నారు. మూర్ఛ వ్యాధి, ఫిట్స్, నరముల వ్యాధి సమస్యలు కలవారికి, పార్కిన్సన్ వ్యాధి, అల్జీమర్స్ వ్యాధి, కాళ్లు చేతులు జోములు, తిమ్మర్లు కలవారికి, మైగ్రేన్, తలనొప్పితో బాధపడుతున్న వారికి వైద్య చికిత్సలను అం దించి, ఆరోగ్య సూత్రాలను తెలిపామన్నారు. తెలిపారు. షుగర్, బిపి ఈసీజీ పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేశామన్నారు. కల్తీ ఆహారం, కల్తీ మద్యం, సిగరెట్టు, మద్య పానం లాంటివి ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బ తిస్తాయన్నారు. సొంత వైద్యం చేయించు కోవడం ప్రాణానికే ముప్పు అని తెలిపారు. శరీరంలో అతి ముఖ్యమైన భాగం మెదడు, వెన్నుపాము అని, జబ్బును ముందుగానే గుర్తించి తగిన సమయంలో వైద్య చికిత్సలు అందించుకోవా లని తెలిపారు. అనంతరం స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియాలు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని వాహనదారులందరూ నియమ నిబంధనలు, తప్పక పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ వెంకట రాముడు తెలిపారు. మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కొత్తగా అమలు కానున్న మోటార్ వెహికల్ చట్టం ప్రకారం జరిమానా తప్పక వేయబడునని తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి మోటార్ వాహనాల చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. హెల్మెట్ లేకపోతే వెయ్యి రూపాయలు, వాహనంలో వెనక కూర్చున్న వ్యక్తికి కూడా హెల్మెట్ తప్పనిసరి అని లేనియెడల వెయ్యి రూపాయలు జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి రూ.వేయి, వాహనానికి బీమా లేకపోతే రూ.వెయ్యి, రెండోసారి పట్టుబడితే రూ.2 వేలు, కల్లం/పొగా కాలుష్యం చేస్తే రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు, డేంజరస్ పార్కింగ్ వద్ద వాహనము ఉంచితే రూ.1500 నుండి రూ.3వేల వరకు, ఓవర్ స్పీడ్ వెళితే రూ.5 వేలు, డేంజరస్ డ్రైవింగ్ చేస్తే రూ.10 వేలు, మైనర్లు డ్రైవింగ్ చేస్తే రూ.వెయ్యి జరిమానా ఉంటాయని తెలిపారు. ప్రయాణికులను రవాణా వాహనాల్లో ఎక్కిస్తే మనిషికి రూ.200 చొప్పున జరిమానాలు తప్పక విధిస్తామని తెలిపారు. నూతన చట్టాన్ని గౌరవిస్తూ సహకరించాలని కోరారు.

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి...

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 14వ తేదీన పిఠాపురం చిత్రాలలో జరగబోయే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం జనసేన పార్టీ నూతన కార్యాలయంలో హిందూపురం పార్లమెంటు పరిధిలో ఉన్నటువంటి ఏడు నియోజకవర్గాల జనసేన పార్టీ ఇన్చార్జిలతో, పాయింట్ ఆఫ్ కాంట్రాక్టర్లు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యు, వీర మహిళలు, ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కనీ విని ఎరుగని రీతిలో పవన్ కళ్యాణ్ పేరు జనసేన పార్టీ గురించి దేశవ్యాప్తంగా చేర్చుకునే విధంగా ఘనంగా నిర్వహించాలని ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమని తెలిపారు. పిఠాపురానికి లక్షల్లో నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.. త్వరలో హిందూపూర్ పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గం లో ఇన్చార్జి ఆధ్వర్యంలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ లతో సమావేశాలు నిర్వహించేలా చర్యలు కూడా చేపడతామని తెలిపారు.

## మంత్రి అచ్చెంనాయుడు వ్యాఖ్యలు ఉపాధ్యాయ ఉద్యమాన్ని అవమానించేవిగా ఉన్నాయి

విశాలాంధ్ర-ధర్మవరం: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మంత్రి అచ్చెంనాయుడు యుటిఎఫ్‌కు, వైసిపి ముసుగువేస్తూ చేసిన వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్ర రెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ యూటీఎఫ్‌కు వైసీపీ ముసుగు వేయడం సరికాదని, వాస్తవానికి ఏపీటీఎఫ్, పిఆర్ టి యు అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని విమర్శించారు. కూటమికి బహిరంగంగా మద్దతు పలికిన అభ్యర్థి ఓటమి, వారు విద్యారంగంలో అనుసరిస్తున్న విధానాలకు చెంపపెట్టు అన్న విషయం ఎమ్మెల్సీ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ స్వతంత్రంగా పోటీ చేసిందని దానికి యూటీఎఫ్, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలియజేశాయని గుర్తు చేశారు. యూటీఎఫ్ ఏ అధికార, ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా ఉండదని స్పష్టం చేశారు.ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేటువంటి సంస్థ. ప్రభుత్వ విధానాలను కాపాడే సంస్థ అని, యుటిఎఫ్‌ను రాజకీయాలకు అంటగట్టడం సరికాదని వారు మండిపడ్డారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఈ ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన యుటిఎఫ్ స్టైర్యం కోల్పోదని, ప్రజా వ్యతిరేక విధానాల పట్ల పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మవరం పట్టణ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, సాయి గణేష్, మునిసిపల్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లె రామాంజనేయులు, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, రామాంజనే యులు, హరిశంకర్, ప్రదీప్ కుమార్ , వెంకట కిషోర్ పాల్గొన్నారు.

## అరుణాచలం, కాణిపాకం గోల్డెన్ టెంపుల్‌కు బస్సులు ఏర్పాటు

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 14వ తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరి ప్రదర్శన, కాణిపాకం గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం ధర్మవరం ఆర్టీసీ డిపో నుండి 13వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాను, పోను చార్జీలు రూ.1400లు మాత్రమేనని, ఆన్‌లైన్ గాని బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లో సీట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. భగవంతుని సేవలో భక్తులు-భక్తుల సేవలో ఏపీఎస్ ఆర్టీసీ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 6303151302, 9959225859కు సంప్రదించాలని కోరారు.

## అబాకస్‌లో ఎస్వీఎస్ విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో గల ఎస్వీఎస్ ఇంగ్లీష్ మీడియం లో ఏడవ తరగతి చదు వుతున్న కే రఘురాం విశ్వం ఎడ్యుకేట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్ వేదిక్ మాథ్స్ నేషనల్‌లో లెవెల్-3 విభాగంలో నేషనల్ ఫస్ట్ ప్రైజ్ తో పాటు రూ.5 వేల నగదును, షీల్డును కైవసం చేసుకోవడం జరిగిందని కరస్పాండెంట్ పి.శాంతమ్మ తెలిపారు. మా పాఠశాలలో చదువు, ఆటలు, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. గతేడాది కూడా ఐదవ తరగతి విద్యార్థి వెంకటేష్ లెవెల్-4 లో నేషనల్ లెవెల్ ఫస్ట్ ప్రైజ్ సాధించారని తెలిపారు. డైరెక్టర్లు మోహన్, ఉపాధ్యాయులు శంకర్ నాయక్, శివ అభినందించారు.

## రెవిన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండలంలో పెండింగ్ లో ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని పుట్టపర్తి ఆర్డిఒ సువర్ణ తెలిపారు. తాహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నెలకొన్న సమస్యల గురించి తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల పరిష్కారించడంలో జాప్యం చేయడం తగదని త్వరగా తిను పూర్తి చేయాలన్నారు. అలాగే రీ సర్వే పనులను కూడా వేగవంతంగా నిర్వహించాలన్నారు. ఇంటింటా కులగణన పై సర్వేను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీవో నటరాజు, డిప్యూటీ తాహసిల్దార్ బాలా అంజనేయులు, ఆర్ఐ కిరణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## భూరీసర్వే వేగవంతం చేయండి

### ఆర్‌డిఓ ఆనంద్‌కుమార్

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని కుంబరనాగేపల్లి గ్రామ సచివాలయాన్ని పెనుగొండ ఆర్డిఓ ఆనందకుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూరి సర్వే వేగవంతం చేయాలని అలాగే ఫైయిర్ ఎడంగల్, చల్లా నంబర్లును, మ్యుటేషన్ రిజిస్టర్ తదితర రికార్డులను తనిఖీ చేసి ప్రభుత్వం అందిస్తున్న సర్వేలు పీ4, వర్క్ ఫ్రం హౌమ్ తదితర సర్వేలను గ్రామ సచివాలయ ఉద్యోగస్తుల తో పాటు రెవెన్యూ అధికారులు కూడా పాల్గొని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి అధికారి గంగాధర్, భూ రీ సర్వే డిప్యూటీ తాహశీల్దార్ రామ్ భూపాల్ రెడ్డి, మండల సర్వేయర్ పరికిషోర్, సచివాలయ సర్వేయర్లు జయచంద్ర, నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

## హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలో ఉన్న హైరిస్క్ గర్భవతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ ఆనంద్ వర్ధన్ సూచించారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చాలా రోజుల తర్వాత గర్భవతులైన, పౌష్టికాహార లోపం, మేనరికంలో వివాహం చేసుకు ని గర్భవతులైన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి సూచనలు ఇవ్వాలని సూచించారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా వున్న వారికి వ్యాక్సిన్ తప్పక వేయించుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. వడదెబ్బ జాగ్రత్తలు, లక్షణాలు గురించి మరియు ఆహార అలవాట్లు, టీనేజ్ ప్రెగ్నెన్సీ అరికట్టడం అలాగే దాని ప్రమాదాలు గురించి ప్రజలకు వివరించాలని, దోమల నివారణకు చర్యలు ఫ్రైడే డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ నాగలక్ష్మి, హిహెచ్ఇఎ శాంతమ్మ, సూపర్వైజర్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీహెచ్ రాఘమ్మ, ఎంపీహెచ్ఈవో రమేష్ రెడ్డి, కిషోర్ రెడ్డి, ఆది, ఫార్మసిస్ట్ ప్రకాశం, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-అగళి : అంతర్జాతీయ మహిళా వారోత్స వాన్ని పురస్కరించు కుని పోలీసులు మంగళవారం విద్యార్థినీలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ.వి. రత్న ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ మార్చి 8 వరకు జిల్లా వ్యాప్తంగా "మహిళా దినోత్సవ వారోత్సవాలు" నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళ వారం మండల వ్యాప్తంగా మహిళ చట్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా చట్టాలు, అవగాహనపై ఎస్సై రైటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా మహిళా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, మహిళా చట్టాలు, ర్యాగింగ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పాఠశాలల్లో మహిళ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలపై విద్యార్థులకు శిక్షణ

విశాలాంధ్ర-బుక్కపట్నం: మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలపై మంగళవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాల నందు చీఫ్ సూపరింటెండెంట్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, మండల విద్యాశాఖ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ విద్యార్థులకు 104 సెంటర్లను, ఓపెన్ విద్యార్థులకు 11 సెంటర్లుఏర్పాటు చేశామని, ఇన్విజిలేటర్లు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎటువంటి తప్పులు జరక్కుండా తీసుకోవాల్సిన బాధ్యత ఎంతవరికైనా ఉందన్నారు. విద్యాశాఖ అధికారుల సమన్వయంతో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప, డిప్యూటీ డిఈఓ పద్మప్రియ, డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్,ఎడి రామకృష్ణ, డీ సీఈబీ భాస్కర్ రెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి : సీఐ

విశాలాంధ్ర-నల్లమాడ : రోడ్డు భద్రత నియంత్రణను వాహన చోదకులు పాటించా లని సీఐ నరేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం నూతన ట్రాఫిక్ నిబంధ నలు తెలుసుకొని వాటికి అనుగుణంగా వాహనాలలో ప్రయాణించాలని సూచించారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు,ప్రజలకు హైకోర్టు ఉత్తర్వులపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనంలో ఇద్దరూ కూడా హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టు తప్పనిసరి అని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం తగదన్నారు. వీటిని ఉల్లంఘిస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని, ఈ అమలు మంగళవారం నుంచే ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 5, మార్చి 2025

# జీఓ 21, 31లను రద్దు చేయాలి..

## ప్రతి ఆటో కార్మికునికి వాహనమిత్ర రూ. 15 వేలు ఇవ్వాలి : ఏఐటీయూసీ

**విశాలాంధ్ర, అనంతపురం:** ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మంగళవారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల్లో ఉన్న ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో కార్మికునికి రూ. 15 వేలు వాహన మిత్ర వెంటనే ఇవ్వాలన్నారు,కార్మికులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న జీఓ నెం. 21,31లను వెంటనే రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏమి చెప్పినా తానా అంటే తందానా అంటూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోం దన్నారు. విపరీతంగా చలానాలు పెంచి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 849 గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న చలానాలను కూడా రద్దు చేయకుంటే ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజు,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, నగర అధ్యక్షులు దుర్గాప్రసాద్, నాయకులు రమనా నాయక్, రఘు, నరసింహ, భాషా, షర్మాస్, హస్మత్ బీ,గోవింద్ నాయక్, ఓబులేసు, ఆది, బాబు,శ్రీనివాసులు పాల్గొన్నారు.

# సమానత్వ సాధనకు పోరాటం వేగవంతం...

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం :** మహిళలు గౌరవప్రదంగా జీవించే హక్కు దాతృతం కాదని... ఇది మన హక్కు అని, ఈ హక్కును పూర్తిగా సాధించుకొనే వరకు కలిసి కట్టుగా పోరాడాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం ప్రెస్ క్లబ్‌లో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి అధ్యక్షతన ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి దుర్గాభవాని మాట్లాడుతూ మహిళలు తమ హక్కులను పూర్తిగా సాధించుకునేందుకు, మహిళా సాధికారిత దిశగా సమానత్వం కోసం చేసే పోరాటాలను వేగవంతం చేయాలని కోరారు. ప్రిన్సిపల్ ప్రశాంతి, న్యాయవాది పద్మజ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఉద్యమాలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు జరుపుకోవాలన్నారు.

# హంద్రీనీవా ద్వారా 33 చెరువులకు నీరందించండి

- కాలువను దాటేలా వంతెనలు నిర్మించాలి
- సీఎంను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత

**విశాలాంధ్ర-రాప్తాడు :** హంద్రీనీవా ద్వారా రాప్తాడులోని 38చెరువులకు నీరందించాలని నీటి సమస్యలపై సీఎం చంద్ర బాబును ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు.అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. హంద్రీనీవా 2వదశలో కాల్వకు లైనింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు న్యాయని, లైనింగ్ పనులు చేస్తే రాప్తాడు నియోజకవర్గంలో 38 చెరువులకు నీరందకుండా భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని వివరించారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలకు హంద్రీనీవా నీరు అందేలా తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలన్నారు. కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలను నిర్మించాలన్నారు. అదేవిధంగా రాప్తాడులో 70వేల ఎకరాలకు పైగా హంద్రీనీవా పరిధిలో ఆయకట్టు ఉందని, నేటికీ డిస్ట్రిబ్యూటరి సిస్టమ్ లేనందున తాత్కాలికంగా హంద్రీ నీవా నీటిని కాలువ ద్వారా చెరువులకు సరఫరా చేస్తున్నారన్నారు. ఆయకట్టును స్థిరీకరించి పంట కాలవల అభివృద్ధి చేస్తే భూగర్భ జలాలు సంవృద్ధిగా ఉంటాయన్నారు. దీని వలన పరోక్షంగా మరో 10వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం 2018లో భూములిచ్చిన చాలా మంది రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు. ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ నిధులను విడుదల చేసి పనులను పునః ప్రారంభించాలని కోరారు. చెరువులకు నీరందించే విషయంలో రాజీ ఉండదని సీఎం భరోసా ఇచ్చారని ఎమ్మెల్యే వెల్లడించారు.

## జనసేన ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ..

**విశాలాంధ్ర - నార్పల :-** జనసేన పార్టీ నాయకులు 12వ ఆవిర్భావ దినోత్సవ గోడపత్రికలను శింగనమల నియోజకవర్గం ఇంచార్జ్ సాకే మురళి, జిల్లా కమిటీ సభ్యుల ఆద్వర్యం లో ఆవిష్కరించడం జరిగింది. మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా జనసేన పార్టీ వేదికగా ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశామని ఈసారి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉత్సాహం చేసుకుందామన్న జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు తో జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులలో కొత్త ఉత్సాహం ఉగ్రూతలూగుతోందన్నారు. ఆవిర్భావము నుండి అభివృద్ధి వరకు తోడుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సభలో పాల్గొని వేడుక చేసుకోవాలని సూచించారు. మునుపెన్నడూ చూడని విధంగా మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే సభగా 12 వా ఆవిర్భావ దినోత్సవం జరుపుకుందామని, ప్రతి ఒక్క జన సైనికుడు, వీర మహిళలు ,పవన్ కళ్యాణ్ అభిమానులు పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడ లో జరిగే ఆవిర్భావ సభకు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి చప్పాచంద్రా, జిల్లా సంయుక్త కార్యదర్శులు పురుషోత్తంరెడ్డి మరియు కృష్ణమూర్తి, నార్పల మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, ఉపాధ్యక్షులు దాడి తోట శివయ్య, నాయకులు అశ్వత్‌రెడ్డి, వినోదం నారా యణస్వామి కుళ్లాయప్ప, సాకే రాజు, శ్రీధర్ బాబు, వినోదంలోకేష్, నాగరాజు యం.కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర పథకాలకు రైతుల గుర్తింపు కార్డులు తప్పనిసరి

**విశాలాంధ్ర, యాడికి :** మండల పరిధిలోని వేములపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా మంగళవారం నిర్వహించారు..ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ మాట్లాడుతూ రైతులందరూ తప్పకుండా ఏపీ ఎఫ్ ఆర్ రైతుల ప్రత్యేక గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఈ గుర్తింపు సంఖ్య లేకపోతే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందవన్నారు.రబీలో దిగుబడులు సరిగ్గా రానందున యాడికి మండలాన్ని కరువు మండలంగా ఖరారు చేయుటకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపమన్నారు,రైతులకు వ్యవసాయ పనిముట్లు రాయితీపై త్వరలో ఇస్తామన్నారు.పంటల యాజమాన్యంపై ఎప్పటికప్పుడు రైతు సేవా కేంద్రం ద్వారా సలహాలు తీసుకోని మంచి దిగుబడులు పొందాలన్నారు. మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, వ్యవసాయ విస్తరణ అధికారి జహిరూన్,గ్రామ వ్యవసాయ అధికారి సతీష్ బాబు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

**విశాలాంధ్ర-కొత్తచెరువు:** మండలంలో పెండింగ్ లో ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, తెలిపారు. తాహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నెలకొన్న సమస్యల గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసు కున్నారు. అనంతరం కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహిం చారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల పరిష్కరించడంలో జాప్యం వద్దని త్వరగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే పనులను కూడా వేగవం తం చేయాలని, ఇంటింటా పీపుల్ సర్వేని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తాహసిల్దార్ నీలకంఠా రెడ్డి, ఎంపీడీవో నటరాజు, డిప్యూటీ తహసిల్దార్ బాలా అంజనేయులు, ఆర్ఐ కిరణ్, విఆర్వోలు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**విశాలాంధ్ర-బత్తలపల్లి :** మండల కేంద్రంలో నివాసముంటున్న షేక్ మహబూబ్ బాషా అనే వ్యక్తి సోమవారం రాత్రి 10.30 సమయంలో ఇంటి లోపల ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన బత్తలపల్లి లో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు షేక్ మహబూబ్ బాషా పాన్ షాప్ పెట్టుకుని జీవనం సాగించేవాడు, రెండేళ్లుగా మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఆ విషయంలో భార్య, అతడి తల్లిదండ్రులు రోజు మందలిస్తుండటంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. స్థానికులు ఆర్డిటి ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. భార్య భాను బేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## నేటి నుండి సామాజిక తనిఖీ

**విశాలాంధ్ర-గుడిబండ:** గుడిబండ మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలలో 2024-2025 ఆర్థిక సంవత్సరం గాను నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయత్ రాజ్ పథకంలో నిర్వహించిన అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్పి చంద్రమోహన్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరియు పంచాయతీరాజ్ శాఖలో 7 కోట్ల 22 లక్షల 33 వేల 256 రూపాయలకు సంబంధించిన సామాజిక తనిఖీ బుధవారం నుండి నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

**విశాలాంధ్ర-నంబులపూలకుంట :** గర్భిణీలు, బాలింతలు క్రమం తప్ప కుండా పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఓ రాధిక తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్త లకు పౌష్టికా హారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పౌష్టికాహార పదార్థాలతో మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మాధవరెడ్డి, సూపర్వైజర్లు నరసమ్మ, మౌలాబీ, లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నపప్పూరులో శాశ్వత హుండీ లెక్కింపు

**విశాలాంధ్ర-తాడిపత్రి :** పెద్ద పప్పూరు మండలం చిన్న పప్పూరు గ్రామంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, చక్ర భీమలింగేశ్వర స్వాముల శాశ్వత, తాత్కాలిక హుండీ లెక్కింపు జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి కె.ఆదిశేషు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో దాదాపు 2 లక్షల 6,996 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. గామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలు బాగా పని చేయాలి

**విశాలాంధ్ర, యాడికి :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రము రాయల్ చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా మెడికల్ ఆఫీసర్లు పరమేష్ ,దేవరాజ్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎం లకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏఎన్ఎం లకు ఆశా కార్యకర్తలకు విష జ్వరాల పై అవగాహన కల్పించారు. వెక్టార్ కంట్రోల్ ఐజిన్ ప్రోగ్రామ్ నందు గ్రామంలో దిబ్బలను మురికికుంటలను క్లీన్ గా ఉంచవలనని తెలిపారు. అదేవిధంగా డ్రై డే ఫ్రైడే గురించి వివరించి గ్రామాలలో ఏఎన్ఎంలు తప్పక వారికి ఇచ్చిన టార్గెట్ రక్తపూతలను తప్పక తీసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబులకు పంపాలని తెలియజేశారు, వచ్చేది వేసవికాలం కావున గ్రామాలలో ఓఆర్ఎస్ తప్పక ఉంచుకొనవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ జుబేదా పీహెచ్ ఎన్ వెంకటలక్ష్మి మేల్ సూపర్వైజర్లు రాంప్రసాద్ గౌడ్ ఫిమేల్ సూపర్వైజర్ సరోజమ్మ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో రైలు కింద పడి మునిసిపల్ వర్కర్ మృతి

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని ఎల్3 కేతిరెడ్డి కాలనీలో నివాసము ఉండు మున్సిపల్ వర్కర్ ఆశాది లక్ష్మీదేవి (34) అనారోగ్యంతో మృతి చెందినట్లు హిందూపురం జీఆర్పి కానిస్టేబుల్ ఎర్రి స్వామి, లక్ష్మీనారాయణ, భాస్కర్ తెలిపారు. మృతి చెందిన మహిళకు పలు రకాలుగా అనారోగ్యానికి గురైందని, అప్పుడప్పుడు కుటుంబ కలహాలు కూడా జరిగేటివి అని వారు తెలిపారు. ఈనెల 3వ తేదీ రాత్రి తన ఇంటి వద్ద నుండి బయటికి వెళ్లిపోయిం దని, అనంతరం మంగళవారం ఉదయం ఎల్ శ్రీ కేతిరెడ్డి కాలనీ రైలు పట్టాల వద్ద శవమై పడి ఉన్న దృశ్యాన్ని చూసి స్థానికులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## అబాకస్‌లో ప్రతిభ చాటిన ఏడవ తరగతి విద్యార్థి కే.రఘురాం

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో గల ఎస్వీఎస్ ఇంగ్లీష్ మీడియం లో ఏడవ తరగతి చదువుతున్న కే రఘురాం విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్ వేదిక్ మాథ్స్ నేషనల్ లో లెవెల్-3 విభాగంలో నేషనల్ ఫస్ట్ ప్రైజ్ తో పాటు 5000 రూపాయల నగదును, షీల్డును కైవసం చేసుకోవడం జరిగిందని కరెస్పాండెంట్ పి. కాంతమ్మ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మా పాఠశాలలో చదువుతోపాటు అబాకస్, క్రీడల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే పలు క్రీడల్లో విజేతలుగా ఉన్నామని తెలిపారు. గత ఏడాది కూడా ఐదవ తరగతి చదువుతున్న వెంకటేష్ అను విద్యార్థి లెవెల్-4 లో నేషనల్ లెవెల్ ఫస్ట్ ప్రైజ్ సాధించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆ విద్యార్థులను డైరెక్టర్లు మోహన్, గణితపు ఉపాధ్యాయులు శంకర్ నాయక్, శివలతో పాటు తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి.

**విశాలాంధ్ర - అగళి :** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి కోరుతూ స్థానిక గ్రామ సచివాలయం వద్ద అంగన్వాడీ టీచర్లు అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సంతకాలు చేయించి బాలికల విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ రంగనాథ్ మాట్లాడుతూ బాలికల విద్య, వారి ఉన్నతి, సామాజిక భద్రత కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బేటి బచావో,బేటి పడావో పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. దేశ చరిత్రలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. కాలంతో పాటు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని ఇందుకు చదువు ఒక్కటే దోహదపడుతుందని ఆయన తెలిపారు.బాలికల విద్యపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడం హర్షనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నరసమ్మ, రంగమ్మ, సావిత్రమ్మ, రమామణి,శోభ వీఆర్వో దొడ్డే గౌడ,పంచాయతీ సెక్రెటరీ రంగనాథ్,విద్యుత్ లైన్ మాన్ నరసింహమూర్తి, డిజిటల్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసులు పంజా

**విశాలాంధ్ర-గుడిబండ :** గుడిబండ మండలంలోని హీరేతుర్పి గ్రామ ఎస్సీ కాలని సమీపంలో బహిరంగ ప్రదేశాలలో పేకాట స్థావరాలు ఏర్పరచుకుని జూదం నిర్వహిస్తున్న పేకాటరాయలపై ఎస్సై రాజకుల్లాయప్ప మెరుపు దాడి నిర్వహించి నలుగురు వ్యక్తులు అదుపులోకి తీసుకుని 51 వేల రూపాయలు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఏఎస్ఐ రమణ, పోలీస్ కానిస్టేబుల్ నాగేష్, మహమ్మద్ రఫీ, జగన్నాథ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కణేకల్ గ్రామానికి రానున్న కేదార్ జగత్ గురువులు

**విశాలాంధ్ర, కణేకల్ :** కణేకల్ గ్రామంలో బుధవారం 5వ తేదీ సా 4 గంటలకు శ్రీ కేదార జగత్ గురువులు భీమాశంకరలింగ స్వామి బజాజ్ షో రూం తిప్పేస్వామి వారి ఇంటీకి రానున్నారు. అక్కడ స్వామివారు భక్తులకు సందేశం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి మండ లంలోని వీరశైవులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించా లని కాలశెట్టి తిప్పేస్వామి బజాజ్ షోరూం అఖిలభారత వీరశైవ మహాసభ ఆంధ్రప్రదేశ్ వీరశైవ సంఘం వైస్ ప్రెసిడెంట్ తెలిపారు.

## రూ.లక్ష మద్యాన్ని ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు

**విశాలాంధ్ర, ఉరవకొండ :** ఉరవకొండ ఎక్సైజ్ పోలీస్ సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ దాదాపు లక్ష రూపాయల విలువైన కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు, 52 లీటర్లు నాటు సారాను అధికారులు ధ్వంసం చేశారు. మంగళవారం పట్టణ శివార్లలో జిల్లా అసిస్టెంట్ సూపర్డెంట్ రేవతి ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో వీటిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సూపర్‌డెంట్ మాట్లాడుతూ ఎవరైనా అక్రమ మద్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన గవిమఠం బ్రహ్మోత్సవాలు

-శాస్త్రోక్తంగా గంగపూజ, కంకణ ధారణ

**విశాలాంధ్ర:ఉరవకొండ:** ఉరవకొండ పట్టనంలోని గవిమఠం స్థిత శ్రీచంద్రమౌళీశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి గంగపూజ, కంకణధారణ కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎదురు బసవన్న గుడివద్ద గంగ పూజ తదితర పూజా కార్యక్రమాలు ప్రధాన అర్చకుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం కరిబసవేశ్వర స్వామి జీవసమాధి ఉన్న ప్రాంగణంలో నాగ పూజ, కంకణధారణ కార్యక్రమం నిర్వహించారు. నేటి నుంచి శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారు పలు వాహనాల్లో విహరిస్తారు. ఈకార్యక్రమంలో మఠం సహాయ కమిషనర్ రాణి, ఏజెంట్ రాజన్న గౌడ్, ప్రధాన అర్చకులు విరుపాక్షయ్య, ఆలయ సిబ్బంది గోపి, నారాయణస్వామి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దేమకేతేపల్లిలో ఆహారం.. ఆరోగ్యం కార్యక్రమం

**విశాలాంధ్ర-చిలమత్తూరు:** మండల పరిధిలోని దేమకేతేపల్లి పంచాయతీ గాడ్రాలపల్లిలో సీడీపీఓ శాంతి ఆదేశాల మేరకు త్వరలో జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవము ను పురస్కరించుకుని మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఆహారం ఆరోగ్యంలో భాగంగా యోగా చేయించడం ఆహారం విషయంలో సమతుల ఆహారం తీసుకోవడం గురించి కార్యక్రమాలను నిర్వహించాము. బాలలం దరికీ హక్కులు సమానత్వం సాధికారత. ఈ కార్యక్రమం లో సూపర్వైజర్ లలితమ్మ అంగన్వాడీ కార్యకర్త భాగ్యమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్ర ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

కలెక్టర్ టీఎస్ చేతన్

**విశాలాంధ్ర-పుట్టపర్తి :** ప్రకృతి వ్యవసాయంపై రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలిజిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం సాయిరాం ఫంక్షన్ హాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ, ఉద్యానవనశాఖ, సెరీ కల్చర్, వెలుగు శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డిఆర్డిఏ పిడి నరసయ్య, ఉమ్మడి జిల్లా డిపిఎం లక్ష్మా నాయక్ హాజరయ్యారు. ముఖ్యఅతిథి కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా మహిళా సంఘాల ద్వారా ముందుకు తీసుకువెళ్లాలన్నారు .రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం చేకూరే విధంగా సహకారాన్ని అందించా లన్నారు. మన జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉంటుందనీ, దాని వలన పంటలు వేయకుండా బీడు భూములు అధికంగా ఉంటున్నాయి అలా కాకుండా ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ మహాగని, మునగ, సిల్వర్ ఓక్ చెట్లను పెట్టడం వలన నేలను సూర్య రష్మి పడకుండా ఆర్గానిక్ కార్బన్ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చున్నారు .ప్రధాన పంటలు వేరుసెనగ కంది చిరుధాన్యాలు ప్రకృతి వ్యవసాయ విధానాలను అమలు చేస్తూ పండించడం వలన ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయడమే కాకుండా మంచి ధర ఆదాయం పొందవచ్చు అని తెలిపారు. డీపీఎం లక్ష్మా నాయక్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, మోడల్స్, కేఏపి మొదలైన అంశాలను క్లుప్తంగా వివరించారు. డీఏఓ శ్రీ సుబ్బారావు ప్రకృతి వ్యవసాయం గురించి,కేఏపీ సమన్వయ సమావేశాలు జిల్లా,మండల, గ్రామ స్థాయిలో జరిగే విధానాన్ని క్లుప్తంగా వివరించటం జరిగింది.పిడి డిఆర్డిఏ నర్సయ్య ప్రకృతి వ్యవసాయ ఉత్పతులు తినటం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిపారు. పట్టుపురు గులను పెంచడంలో మంచి ఫలితాలను ఇస్తుందని రైతులు రజిని, రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అను బంధ రంగాల అధికారులు, మండల మహిళ సమైక్య సభ్యు రాలు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.